కథావేదిక

# బ్రూటస్ భార్య!

- శ్రీసుభా

నిజం- వెంకట్రావుగారికి నిద్ర పట్టడం మానేసి చాలారోజులయింది. దానికి కారణం, ఆయన రెండేళ్ళుగా పనికిమాలిన ఆలోచనల్లోపడి వాటిల్లో మునిగిపోతూ ఉండడమే! ఆయన తనకు ఎదురైన సమస్యల్ని పరిష్కరించుకోవడం మానేసి నిత్యం కొత్త సమస్యల్ని సృష్టించుకుంటూ, వాటికి బలి అవుతూ అదో నిత్యకృత్యంగా చేసుకున్నాడు. చాలా రాత్రుళ్ళు ఒక్కడూ తన ఇంటి బాల్కనీలో నిలబడి నిశిరాత్రికి ఏకైక ప్రతినిధిగా ఎక్కడో ఆలోచిస్తూ వుంటాడు.

నిజానికి ఆయన ఈ అవస్తల వేటికీ లోను కానవసరంలేదు. హాయిగా బ్రతకొచ్చు. కొడుకులిద్దరూ బాగా చదువుకున్నారు. కొత్తగా వాళ్లకీమధ్యే ఉద్యోగాలు కూడా దొరికాయి. ఇక పెళ్లిళ్ళు అవడం ఒకటే తరువాయి. భార్య జానకి మంచిదీ, తెలివైంది కూడా. అయితే ఆవిడకు పెళ్లి అయిన కొత్తలోనే భర్త నైజం మొదట ఆశ్చర్యాన్ని, ఆ తరువాత భయాన్ని, ఆఖరిగా బాధనీ కుప్పతెప్పలుగా కానుకలుగా ఇచ్చాయి. భర్త తనా, పరా అనే బేధం లేకుండా అందర్నీ అనుమానించి, అవమానపరచి ఎవరికీ అందని వ్యక్తిగా, ఎవరికీ నచ్చని మనిషిగా బ్రతకడం ఆమెకు ఒక్కొక్కసారి ఎంత వద్దనుకున్నా అసహ్యం అన్పించేది. ఒకసారి ఇదే విషయం తన అన్నగారు రఘుపతి ముందు ఏకాంతంలో చెప్పి వాపోయింది. రఘుపతి వేదాంతి. అన్నీ విని ఆపైన ఆలోచించి చెల్లెలితో అనునయంగా అన్నాడు.

''చూడమ్మా జానకీ! పరిణామక్రమంలో మనుషులెప్పుడూ వింత పోకడలతో కన్పిస్తారుట. మనం ఈ వేళ మనిషి జన్మ ఎత్తినా మనలో యుగాల పూర్వంనాటి జంతు లక్షణాలు మృగ్యం కావుట. కొద్దిగా మిగిలే వుంటాయిట. ఎందుకంటావేమో మనం వాటి వారసులం కావడమే ఓ కారణం అని కొందరు ఆధ్యాత్మికవాదులు చెప్పగా విన్నాను. కొత్తగా అంటే మొదటిసారి మానవ జన్మ తీసుకున్నవాళ్లలో ఇలాంటి చాలాకాల విపరీత లక్షణాలు తరచు బయటపడుతూ వుంటాయిట. నువ్వు చదువుకున్నదానివి కాబట్టి నీ భర్తతో నువ్వే సర్దుకుపోవాలి. మరో దారి లేదేమో...''

జానకి ఏం మాట్లాడలేదు. కానీ ఆమెకు చాలా కాలం తరువాత ఓ చిక్కు ప్రశ్నకు సమాధానం దొరికినట్టయింది. ఆపైన అందరూ తరచూ 'నుదుటివ్రాత, రాసి పెట్టుకున్నదాన్ని తప్పించుకోలేం' అనే ఓదార్పు మాటల్లో కొంతైనా నిజం ఉండి ఉండాలనే అన్పించింది.

ఆవేళ రోజులాగే పక్కనే పడుకున్న వెంకట్రావుగారు జానకిని ఒకటికి రెండుసార్లు కుదిపి ''నిద్రపోతున్నావా?'' అని అడిగాడు.

''ఏమిటీ?'' అంది మగతగా జానకి.

''అదే, మన ముకుందం, రాజీవ్‌ల సంగతి..''

''చెప్పండి.''

''వీళ్లీమధ్య బొత్తిగా నా మాట పట్టించుకోవడం లేదు. నువ్వు గమనించావా?''

జానకి చిన్నగా ఆవలించి అంది ''లోకంలో పిల్లలందరూ అలానే వున్నారు.''

''అలా తీసి పారేయకు. మన పెద్దవాడు ముకుందానికి విశ్వనాధంగారి అమ్మాయి నవజ అంటే ఇష్టం. వాడి స్నేహితుల ద్వారా ఆచూకీ తీసాను కూడా...నా అనుమానం'' అని ఆగిపోయాడు వెంకట్రావు.

''అనుమానపడుతున్నది మీరు. నేను కాదంటాను. ఒప్పుకోగల్రా!''

''నీ మొహం నీకేం తెలుసు? వాడితో గట్టిగా చెప్పు. వెధవ వేషాలువేస్తే నేను ఊరుకోను. వాడికి బరువు బాధ్యతలు మరోసారి గుర్తు చేయి నువ్వు.''

''దయ వుంచి ఆ బాధ్యత నామీద పెట్టకండి. వాళ్ళూ మీరూ ఏం పడతారో మీ ఇష్టం.''

వెంకట్రావుగారికి భార్య అలా మాట్లాడ్డంతో ఒక్కసారి కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాడు.

''నేను చెప్పేది విను జానకీ. ఇది మనింటి సమస్య. నీకు మాటిస్తున్నాను. ముకుందంగాడికి మీ అన్నకూతుర్ని చేసుకుందాం. వెనక నేను కాదన్నాను. కానీ నా ఉద్దేశ్యం మార్చుకుంటున్నాను. నన్ను నమ్ము. సరేనా?''

జానకి భర్తతో వాదనకు దిగడం ఇష్టం లేనట్టు ముభావంగా అంది ''అయినా పిల్లనిస్తామని వాళ్ళు ఎవరైనా మన గుమ్మం ఎక్కినప్పుడు కదా ఇవన్నీ...'' అంది.

''అది వేరే విషయం. కానీ నువ్వు స్తబ్దుగా పడి వుండకుండా తెలివిగా కుర్రాళ్ళ మనసు ఎటు పోతోందో తెలుసుకుంటూ వుండు.''

''సరేలెండి. నాకు నిద్ర వస్తోంది. ఈపాటి దానికి...'' అని మరోసారి ఆవలించింది జానకి. ఆపైన పక్కకి తిరిగి పడుకుంది. అయినా ఆమెకు నిద్ర రానేలేదు. ఆలోచనలు ఎటో పోసాగాయి. పిల్లల్ని పెంచుతూ వాళ్లను పెద్దవాళ్ళనూ చేస్తున్నప్పుడు ఎదురైన ఆర్ధిక ఇబ్బందులూ భర్తకూ తనకూ, భర్తకూ పిల్లలకూ, తనకు పిల్లలకూ మధ్య తలెత్తిన అభిప్రాయబేధాలు లీలగా గుర్తుకు రాసాగాయి. అలా ఆ ఆలోచనలు చాలాసేపు సాగి ఆ తర్వాతే ఆమెకు నిద్రకు దగ్గర చేసాయి.

అటు గుండెలమీద రెండు చేతులూ వేసుకుని పడుకున్న వెంకట్రావుగారికి కూడా తేలిగ్గా నిద్ర పట్టలేదు. పెద్దకొడుకు ముకుందం ఏ ఆస్తిపాస్తులు లేని విశ్వనాధం కూతురు నవజ కోసం తనని ఎదిరిస్తోన్నట్టు...తను కాదంటే ఆమెకోసం ఇల్లు వదిలి పోవడానికి నిర్ణయించుకున్నట్లు...అటు జానకి తన అన్నగారి కూతుర్ని కోడలిగా స్వీకరించడానికి తటపటాయిస్తున్నట్లు... అలా అలా ఆయన తన ఆలోచనల సుడిగుండాల్లో క్రిందా మీదా అవసాగాడు.

• • •

నవజ ఆఫీసునుంచి బయటకు వచ్చింది. సరిగ్గా అప్పుడే దగ్గరగా వచ్చి నిలబడ్డ ముకుందం ఆమెకు కన్పించాడు.

''హలో!'' అంటూ పలుకరించాడు.

''నువ్వా?'' అంది నవజ.

''మన రూట్‌లోకెళ్ళే బస్సులు రావడానికి కొంచెం ఆలస్యం అవచ్చు. మన డిపోవాళ్ళు స్ట్రైక్ చేస్తున్నారు.''

''చచ్చాం.''

''ఇక్కడ నిలబడి చేసేదేముంది నవజా? వెళ్లి కాఫీ తాగి వద్దాం.''

నవజ తల ఊపి అంది ''ఎటూ ఇంటికేగా వెడుతున్నాం. అనవసరం ఖర్చు.''

''అది కాదు, నీతో కొంచెం మాట్లాడాలి. అందుకని కాఫీ వంక పెట్టాను. ఇది నా రిక్వేస్ట్.''

''పద...'' అంది నవజ తలొంచుకుని.


ఇద్దరూ హోటల్లోకి వెళ్లారు. ముకుందం టిఫిన్‌కు ఆర్డరిచ్చాడు.

"ఏమిటీ? నువ్వో ఉద్యోగస్తుడివయ్యావని విన్నాను. నిజమేనా? నిన్ననే ఈ విషయం తెలిసింది. మా నాన్నగారితే. అమ్మతే చెప్పాను. కంగ్రాట్స్ అందుకో."

"థాంక్స్. ఇన్నేళ్ళ చదువుకు నిన్నటిరోజున సార్ధకత దక్కింది. నా నిరుద్యోగం నన్ను బాధించింది తక్కువేగానీ మా నాన్న పోరుతో మాత్రం ఇంతకాలం ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. ఆయన వరస చూస్తే నేను నిరుద్యోగిగానే మిగిలిపోతానేమోనని భయం వేసేది. తెల్లారి లేచి 'ఎప్పుడు ఉద్యోగస్తుడివి అవుతావురా?' అన్నట్టే చూసేవాడు నావైపు. ఓ గండం గడిచిందనుకో."

నవజ చిన్నగా నవ్వి "మనకు తెలియదా మీ నాన్నగారి సంగతి. అంకుల్‌కి కోపం, ఆవేశం ఎక్కువ. ఆమాత్రం తిట్టకపోతే మీరు మాట వినరని" అంది.

ముకుందం కాఫీ తాగుతూ ఒకటికి రెండుసార్లు నవజను చూస్తూ ఆపైన నేల చూపులు, పక్క చూపులు చూస్తూ, మాటల కోసం తడుముకుంటూ ఎడం చేత్తో టేబుల్‌మీద వ్రాస్తూ తన మనసు విప్పాడు. అతను చెప్పిన మాటల సారాంశం ఒక్కటే. తనకి నవజ అంటే చాలా చాలా ఇష్టం అనీ, ప్రేమ అనీ, ఏది ఏమైనా పెళ్లి చేసుకుంటాననీ, తనతోపాటు నవజ కూడా తన అభిప్రాయంతో ఏకీభవించి గొంతు కలిపి ఆపైన జీవిత భాగస్వామిగా మారాలనీ!



ముకుందం చెప్పిన మాటలు వింటూ నవజ ముందు కొంచెం సిగ్గుకు లోనయింది. ఆపైన ఆశ్చర్యపోయింది. ఇంకా ఇంకా భయపడింది. నెమ్మదిగా తనని తాకిన మిశ్రమ భావాలనుంచి వేరుపడే ప్రయత్నం చేస్తోంది. చివరికి గొంతు పెగుల్చుకుంది.

"ముకుందం! మనం ఇరవై ఏళ్లుగా ఒకేచోట వుంటూ స్నేహితులుగా పెరిగి పెద్దవాళ్ళమయ్యాం. నువ్వు ఇలా హఠాత్తుగా ప్రేమ సంభాషణ మొదలుపెడతావని నేను అనుకోలేదు."

"చిన్నప్పటినుంచీ నువ్వంటే నాకు ఎంతో ఇష్టం. ఏం నీముందు మనసు విప్పి మాట్లాడడం తప్పంటావా?"

"తప్పుకాదులే. కానీ ఓ విషయం. మన పెద్దవాళ్ళు ఒకళ్లకొకళ్ళు బాగా తెలుసు. మా నాన్నా మీ నాన్నా ఒకే ఆఫీసులో పని చేస్తారు. నాకు నువ్వెంత దగ్గరగా మసిలావో నీ తమ్ముడు రాజీవ్ కూడా నాకూ, మా ఇంటికి అంత చనువుగా వుంటాడు. నువ్విలా మేరేజ్ ప్రపోజల్స్ తెస్తావని నేను ఊహించలేదు. అయినా నేను కూడా ఆలోచించుకోవాలిగా."

"నిజమే! నువ్వో టైం తీసుకుని జవాబు చెప్పు నవజా!".

"కానీ నువ్వు ఓ సంగతి మరచిపోయావు. మా ఇంటి పరిస్థితులు నీకు తెలుసు. మాదీ మధ్య తరగతి కుటుంబం. నాకు తెలిసినంతవరకూ మీ వాళ్ళు పెద్ద కట్నంతో వచ్చే సంబంధాలను చూస్తున్నారని! కాదా?"

"అది వేరే విషయం నవజా. మావాళ్లకు ఎవేవో ఎన్నెన్నో ఆశలు ఉండవచ్చు. కానీ నాకూ ఆశ వుంటుందిగా?"

నవజ నవ్వేసింది.

"ఏమిటి నవ్వుతున్నావ్?"

"మనవి మధ్య తరగతి కుటుంబాలు ముకుందం. అవి పైకి గొప్పగా కన్పిస్తాయి. కానీ లోపల అంతా డొల్ల. తల్లిదండ్రుల్ని ఎదిరించి పెళ్లి చేసుకునేంతవరకే నువ్వు నాకు హీరోగా, నేను నీకు హీరోయిన్‌గా కనబడతాం. ఆ తరువాత నీకు నీవాళ్ళ అవసరం, నాకు నా వాళ్ళ అవసరం ఎంతటిదో తెలిసొస్తుంది. ఆనాడు అందులో ఎవరు మనకు కలసి రాకపోయినా కథ అడ్డం తిరుగుతుంది. అప్పుడు మనం ఒకళ్ళకొకళ్ళం విరోధులుగా కన్పిస్తాం. అర్ధం చేసుకో."

"మధ్య తరగతి కుటుంబాల్లోని అబ్బాయిలూ, అమ్మాయిలూ ప్రేమించుకోవడంలేదా? హాయిగా బ్రతకడంలేదా?"

"నాకు తెలిసి ప్రేమలో పడి తెగించి ఇళ్ళల్లోంచి పోయి పెళ్లి చేసుకున్న నా స్నేహితులు ఎవరూ కూడా గొప్ప సుఖాల్ని మూటగట్టుకోలేదు. నిజం చెప్పాలంటే ఎరేంజ్డ్ మారేజెస్‌లో కొద్దిగా టీతింగ్ ట్రబుల్స్ అంటామే అలాంటివి ముందు ముందే ఎదురవుతాయి. ఆ తరువాత నేర్పు అనేది వుంటే సర్దుకుపోవచ్చు. కానీ ప్రేమ వివాహాలు అలా కాదు. గొప్పగా మొదలై చప్పగా సాగుతాయి. దీనికి కారణాలు కోకొల్లలు. సంప్రదాయాలు, రక్తసంబంధాలూ, సమాజం అన్నీ కూడా ఏవేవో ప్రాబ్లమ్స్‌ను లేవనెత్తుతాయి."

ఇద్దరూ హోటల్‌నుంచి బయటకు వచ్చారు. ముకుందం దారిలో మరోసారి అడిగాడు "నీకోసం మా అమ్మనీ, నాన్ననీ వదులుకుంటాను. ఇది నా వాగ్దానం. బాగా ఆలోచించు."

నవజ చిన్నగా నవ్వేసింది. ఆపైన నెమ్మదిగా అంది "మనం ఇంత వరకూ మంచి స్నేహితులుగా వున్నాం. అలాగే జీవితాంతం వుందాం. ఇది నా కోరిక. నువ్వు నన్ను అర్ధం చేసుకో. అలాగే అంకుల్నీ, ఆంటీనీ బాధ పెట్టకు. వాళ్ళు మీమీద ఎన్నో ఆశలు పెట్టుకుని వున్నారు."

ముకుందం ముఖం నల్ల

## ధర్మేంద్ర శేషజీవితం



కూతురు ఈషా వొద్దన్నా వినకుండా తల్లిని పట్టుకొని సినిమాల్లోకి వెళ్ళడం ఏమాత్రం ఇష్టంలేని ధర్మేంద్ర ఇటీవల తన సొంతవూరు 'ఖండాలా' వెళ్ళి, అక్కడ ఆధ్యాత్మికంగా గడుపుతున్నాడట. ప్రశాంతంగా, ఒంటరిగా ఈ అనుబంధాలకీ, ఆస్తులకీ దూరంగా హాయిగా ఉందట అక్కడ. ఎంతయినా వయసుతోపాటు ఆధ్యాత్మికం కూడా పెరుగుతుందిలెండి.

## తధిగిణతోం సంగతులు

జోడీ నెం.1 సినిమా షూటింగ్ కోసం గోవిందా, ట్వింకిల్‌ఖన్నా గోవాకి వెళ్ళారు. గోవాలో షూటింగ్ చేస్తుండగా ట్వింకిల్ మూడ్ ఆఫ్ అయిందంటూ షూటింగ్‌కి పేకప్ చెప్పమందట. ఎందుకని ఆరాతీయగా అక్షయ్‌తో తను గోవాలో గడిపిన క్షణాలు గుర్తొస్తున్నాయని వాపోయిందిట. మర్నాడు ఇక ఆగలేక అక్షయ్‌కి ఫోన్‌చేస్తే వెంటనే వచ్చి వాలిపోయాడట. ఇక ట్వింకిల్ ఆనందం చెప్పనలవికాదుట. పాపం!గోవిందా ఇదంతా చూస్తూ వికారంగా ముఖం పెట్టాడట.

## టీవీలో గిరిబాబు

తొలిసారిగా త్రివేణిసంగమం అనే టీవీ సీరియల్‌లో నటిస్తున్నాను అన్నాడు గిరిబాబు. ఎన్నో సినిమాల్లో విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించిన గిరిబాబు ఈమధ్య సినిమాలు తగ్గడంతో కనీసం టీవీ సీరియల్స్‌లోనయినా నటిద్దామనే ఉద్దేశ్యంలో ఉన్నట్టు, అందులోనూ మిత్రుడు నారాయణరావు ఓన్ ప్రొడక్షన్ కాబట్టి నటిస్తున్నానని చెప్పాడు.

- విరాజి

బడింది. కళ్ళు ఎర్రబడ్డాయి. అవమానం వళ్ళంతా జెర్రుల్లా పాకుతూ వేధిస్తోంది. అందుకే తల వంచుకునే అన్నాడు "నాకు తెలుసు నవజా... నువ్వెందుకు ఇలా మాట్లాడుతున్నావో, నువ్వెవర్ని ప్రేమిస్తున్నదీ, అన్నీ నాకు తెలుసు."

"అలానేం" అంది చిన్నగా నవ్వేస్తూ నవజ.

"ఒక మాట గుర్తుంచుకో. నువ్వు ఎవర్ని చూసుకుని నన్ను కాదంటున్నావో వాడు ఏ లెక్కన చూసుకున్నా నాకన్నా గొప్పేమీకాదు, వెడతాను" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు ముకుందం.


నవజ, ముకుందం మాటలకు ఆశ్చర్యపోయింది. అయినా అంతలోనే తేరుకుంది. ఆమెకు చిన్నగా నవ్వు వచ్చింది. ఆ తరువాత నవజ మనసు మరెటూ పోకుండా ఆమెకు నచ్చిన విధంగా, ఆమె మెచ్చిన విధంగా సహజాతి సహజంగా రాజీవ్‌ను కేంద్రంగా చేసుకుని ఆలోచిస్తోంది. అలాగే వెళ్ళి సిటీబస్ ఎక్కింది. నవజ హేండిల్ పట్టుకుని నుంచుంది ఎక్జిట్ ద్వారం దగ్గర. అయితే వెనుక సీటులో కూర్చున్న ముకుందం ఆ సమయంలో తన మనసును మలిన పర్చుకుంటూ, ఈర్ష్యకు ఆవేశానికీ బానిసై విషపుటాలోచనలు చేస్తున్నాడని నవజ ఊహించలేకపోయింది.

• • •

అప్పుడు వెంకట్రావుగారు ఊగిపోతూ వాకిలంత కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ ఆపైన నిప్పులు చెరుగుతూ ఒకటికి పదిసార్లు ముకుందం ప్రవర్తన గురించి రాజీవ్‌తో చెప్పాడు. అతగాడు నవజతో నడుపుతున్న ప్రేమ వ్యవహారం గురించి చెప్పి అంతటితో ఊరుకోకుండా వంటింట్లో వున్న జానకిని కూడా పరోక్షంగా తిట్టిపోసాడు. రాజీవ్ మాత్రం మౌనంగా తండ్రి చెబుతున్నవన్నీ విన్నాడు.

"మీ అమ్మ వాళ్ళ అన్న కూతురు ఈ ఇంటికి పెద్ద కోడలవుతుందని ఆశపడుతోంది. మేం కూడా మీమీద బోలెడు ఆశలు పెట్టుకున్నాం. ఇలా బరితెగిస్తార్రా!"

"ఇవన్నీ అర్థంలేని ఆలోచనలు నాన్నా. అమ్మా, నువ్వూ, మామయ్య పూర్వంలో ఎన్నో అనుకుని వుండవచ్చు. కానీ రేపు రాధ తనకీ సంబంధం ఇష్టంలేదంటే ఎవరేం చేయగలరు?"




"అబ్బో నువ్వూ చాలా పెద్ద కబుర్లు చెబుతున్నావే?"

"సరే నాన్నా ఇది నువ్వూ, నీ పెద్దకొడుకూ తేల్చుకోవాల్సిన సమస్య. నేనేం చెప్పగలను."

"అదేమిటి రా అలా లేచిపోతావ్. కూర్చో. ఇప్పుడు నువ్వు మనింటినీ, వాడినీ రక్షించాలి. అందుకేరా నిన్ను పిల్చింది. మాట విను."

"అంటే?"

"నవజ నీతో కూడా చనువుగా మాట్లాడుతుంది. నాకు తెలుసు. అందుకే నువ్వు నవజతో మాట్లాడు. ముకుందంగాడి గురించి నువ్వెలా చెప్పినా నాకు అభ్యంతరంలేదు. ఈ ప్రేమ ముదిరి పాకాన పడకుండానే దానికి మంగళహారతి పాడాలి. తెలిసిందా?"

"వాళ్ళు పిల్లనిస్తానని మనింటికి రాలేదు. పైగా నవజ వీడ్ని లైక్ చేస్తోందని నమ్మకం ఏమిటి? ఊరికే ముందు నీకెందుకు నాన్నా ఈ కంగారు?"

"నేను చెబుతున్నది నిజం. అయినా ఆ అమ్మాయి సంగతి అనవసరం. వాళ్ళకేం ఆస్తిలేదు. కట్నం ఇవ్వలేడు. మాకు ఆఫీసులో మనస్పర్ధలు వున్నాయి. ఏ పరిస్థితుల్లోనూ ఆయనతో వియ్యం అందేదిలేదు."

"అన్నయ్య నన్ను అపార్థం చేసుకుంటాడు నాన్నా. ఈపని తప్పు. మనింట్లో ఆడపిల్ల వుంటే మనం ఇలా మాట్లాడగలమా?" రాజీవ్ ఏదో చెప్పబోయాడు.

"నోర్మూయ్. నాకు నీతులు చెప్పకు" అరిచేసి బైటకి వెళ్ళిపోయాడాయన.

రాజీవ్ కూడా వెళ్ళిపోయాడు.

జానకి ఏమీ తోచక వాకిట్లో పుస్తకం ముందు వేసుకుని కూర్చుంది. పది నిముషాల తరువాత వీధిలోంచి ముకుందం వచ్చాడు. వస్తూనే ముభావంగా లోపలికి వెళ్ళిపోయాడు. జానకి టేబుల్‌మీద కంచం పెట్టి అన్నీ సర్దింది. ముకుందం వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

జానకి కాసేపు ఆగి అంది "నువ్వు నాలుగురోజులుగా వేళకి ఇంటికి రావకపోవడంతో మీ నాన్న కంగారు పడుతున్నాడు."

"నాన్నకి వేరేం పనేం వుందమ్మా. ఏదో ఒకటి కల్పించుకుంటాడు. తన కాళ్లకు తనే బంధాలు వేసుకుని చుట్టుపక్కల వాళ్లను ఆడిపోస్తాడు."

"ఆ విశ్వనాథంగారి కుటుంబం, మనం ఎంతోకాలంగా స్నేహంగా వుంటున్నాం. మనకు రాకపోకలు వున్నాయి. నవజ మనింటికి వస్తుంది. మీరు వాళ్లింటికి వెళతారు" ఆవిడ కాసేపు ఆగి నెమ్మదిగా భర్త తనని హెచ్చరించడం, ఆయన మనసులో మాట, అనుమానం అన్నీ విడమర్చి చెప్పింది.

ముకుందం కాసేపు మాట్లాడలేదు. కంచంలో చెయ్యి పెట్టి కెలుకుతూ వుండిపోయాడు. ఆ తర్వాత తేరుకుని చిన్నగా ఓ నవ్వు నవ్వి "అమ్మా! నవజ గురించి నాకొక్కడికేకాదు, రాజీవ్‌కూ తెలుసు. అయినా ఆ అమ్మాయంటే నాకు ఇష్టమని నేనెవరికీ చెప్పలేదే. అంతకన్నా అప్సరసలు ఎంతోమందిని నేనెరుగుదును. నవజ అంటే ఇష్టపడడం, వెనకపడ్డం ఆ పన్లన్నీ రాజీవ్‌గాడు చేస్తున్నాడు. మీరు వాడిని వదిలి నన్ను తప్పుపట్టడం అన్యాయం."

"ఇదేమిట్రా మధ్యలో..."

"నువ్వు ఇంటిలో ఉంటావమ్మా. అన్ని విషయాలూ నీకు తెలియవు. నాన్న చెప్పింది, రాజీవ్ చెప్పిందే

నిజం అనుకోకు. నాకూ చాలా నిజాలు తెలుసు.''

జానకి మౌనంగా వింటోంది.

''ఆ నవజ మనం అనుకునేటంత అమాయకురాలేం కాదు. రాజీవ్‌గాడు ఎర్రగా బుర్రగా వున్నాడని, ఉద్యోగం చేస్తున్నాడని వాడితో ఎక్కువ చనువుగా వుంటోంది.''

''అపు నాయనా!'' అంది విసుగ్గా జానకి.

''నా క్లాస్‌మేట్ కళ్యాణ్ అని వున్నాడు. వాడు ఈ నవజ వెంట పడుతున్నాడు. అది తెలియక మనవాడు ఆమె చుట్టూ ప్రదక్షిణాలు కొడ్తున్నాడు'' అంటూ ముకుందం డైనింగ్ టేబుల్ దగ్గరనుంచి లేచి వాష్‌బేసిన్ వైపు కెళ్లాడు. అక్కడినుంచే తల్లివైపోసారి చూసాడు. తల్లి ఆందోళనతో అటూ ఇటూ అవుతున్న విషయం గ్రహించి ముకుందం గోడవైపు తిరిగి తనలో తను నవ్వుకున్నాడు. ముకుందం పెదాల మధ్య నుంచి వచ్చిన ఆ విషపు నవ్వు ఆ తల్లి చూడలేదు. చూసుంటే ఆ క్షణాలు ఎంత భయంకరమైనవో ఆమెకు అర్ధమయ్యేది.

• • •

''రేపు మీ మామయ్య రఘుపతి వస్తున్నాడు. కారణం నీకు మీ అమ్మ చెప్పే వుంటుంది'' అన్నాడు వెంకట్రావు గారు ముకుందంతో.

ముకుందం తల వంచుకుని వింటున్నాడు.

''వాళ్ళ అమ్మాయి రాధను నీకిస్తాననీ, మీతో మాట్లాడ్డానికీ...''

''చేసుకుంటానుగానీ నాదో షరతు వుంది.''

''మళ్ళీ ఏమిట్రా...చెప్పి ఏడు.''

''ఏ పరిస్థితుల్లోనూ మీరు రాజీవ్‌గాడు ఆ నవజను పెళ్లి చేసుకుందుకు ఒప్పుకోకూడదు. ఒకవేళ వాడు పెళ్లి చేసుకుంటే నేనీ ఇంట్లో వుండను. వేరే వెళ్లిపోతాను. మీ ఇష్టం.''

''ఒరేయ్...అదేమిట్రా? నీ దుంపతెగా...''

''నేనింత గట్టిగా చెప్తున్నానంటే కారణం వుంది. రాజీవ్‌గాడు అలా ఉన్నాడని, అమాయకుడనీ నువ్వు అనుకుంటున్నావు? వాడు గుండెలు తీసిన బంటు నాన్నా. కానీ ఆశ్చర్యం వాడు ఏం చెప్పినా నువ్వు నమ్ముతావు. నన్ను నమ్మవు.''

అప్పుడు వెంకట్రావుగారి మనసనే కాసారంలోని ఆలోచనలు ముకుందం మాటలతో మరిగి మరిగి సెగలు వేస్తున్నాయి. ఆయనకు రాజీవ్, నవజ ఆగర్భ శత్రువుల్లా కన్పిస్తున్నారు. ప్రేమ వలయంలో చిక్కుకున్న రాజీవ్‌కు ఎలా గుణపాఠం చెప్పాలోనని పావులు కదిలిస్తున్నాడు. అప్పుడు ఆయనముందు వంచన, నయవంచన లాంటి అనేక వక్రమార్గాలు కదలాడుతున్నాయి.

''నేవెడతాను నాన్నా.''

''మామయ్య వస్తాడు. త్వరగా వచ్చేయ్.''

''నాన్నా...మామయ్య కదా అని మెతకబడి తక్కువ కట్నానికీ, తక్కువ లాంఛనాలకు అమ్మ తల ఊపుతుందేమో! మీరో కన్నేసి వుంచండి'' అన్నాడు ముకుందం నవ్వుతూ.

''మీ అమ్మ ఇప్పటికే గాలిలో తేలిపోతోంది. ఆమెకు బురిడీ ఎలా వేయాలో నాకు తెలుసులే'' అన్నాడు వంకరగా నవ్వుతూ వెంకట్రావుగారు.

• • •

రెండుగంటలు ఆ ఇంటిలో ఆనందం వెల్లి విరిసింది. వెంకట్రావుగారు ఊరునుంచి వచ్చిన బావమరిది రఘుపతికి మర్యాదలు చేస్తూనే తన బావగారి హోదాకు, కాబోయే వియ్యంకుడి బెట్టు జత కలిపి ఇల్లంతా కలియతిరిగాడు. జానకయితే తనకే సహజమయిన మంచితనంతో వదిన పార్వతితో కష్టసుఖాలు చెప్తూ కలివిడిగా మసిలింది. ఇక ముకుందం మాత్రం ఆ క్షణాన్నుంచే అల్లుడి అవతారం ఎత్తేసి నేలమీద నడవడం మినహా గత్యంతరంలేక కాళ్ళు సాధ్యమైనంతవరకూ ఎత్తెత్తి వేస్తున్నాడు.

ఇంతలో వెంకట్రావుగారు, రఘుపతి అటు వచ్చారు.

''బావగారూ! ఇక వీడి పని పట్టాల్సివుంది కదూ!'' అన్నాడు రాజీవ్‌ని చూస్తూ రఘుపతి.

''అవునవును. నీ మేనళ్ళులిద్దరూ బ్రతికుండానే నాకు నిప్పుపెట్టే రకాలు. అందులో వీడు మరీ బరితెగించిన రకం.''

''తెల్లారి లేస్తే మా నాన్నకి అమ్మనీ, మిమ్మల్నీ, ఎందుకో అందుకు తిట్టి విమర్శిస్తేగానీ తోచదు మామయ్యా!''

''వచ్చేనెలలో పండుగ రోజుల తరువాత మంచి రోజులు వున్నాయి. మీరు అనుమతిస్తే అప్పుడు తాంబూలాలు పుచ్చుకుందాం'' రఘుపతి వెంకట్రావు గారితో అన్నాడు. ఆ సాయంకాలం రఘుపతి ఒక్కడూ తిరుగు ప్రయాణం అయ్యాడు. రాజీవ్ మేనమామకు తోడుగా స్టేషన్‌కు వెళ్లాడు. ఇద్దరూ కాసేపు కుటుంబ విషయాలు, లోకం గురించీ, ఉద్యోగాల గురించీ మాట్లాడుకున్నారు.

రఘుపతి క్షణం ఊరుకుని అడిగాడు ''ఏమీ అనుకోకు రాజీవ్ నీ స్వంత విషయాలు అడుగుతున్నానని. మీ నాన్న బాధపడుతూ నీ గురించి చాలా చాలా చెప్పాడు. నేను నమ్మలేదు. అసలు ఏం జరిగింది?''

రాజీవ్ మౌనంగా వుండిపోయాడు.

''మీ నాన్న తరహా నాకు తెల్సిందే. గోరింతల్ని కొండంతలు చేసుకుంటాడు. అయినా నిప్పులేనిదే పొగ రాదుగా.'

''ఏం చెప్పమంటావ్ మామయ్యా.''

''జరిగింది కాదులే. నిజం చెప్పు.''

''నేను తెలిసో తెలియకో ఓ అడుగు ముందుకు వేసాను.



## ఉత్తరాలు

భార్య: ''ఎక్కడికండీ సూట్‌కేస్ తీసుకుబయల్దేరారు?''

భర్త: ''అచ్చయిన నాకథ బావుందంటూ పది వుత్తరాలు రాసి పోస్ట్ చేసి వస్తా...''

## బోరు

టీచర్: ''మీకు బోరుగా వున్నట్టుంది. ఏదైనా కథ చెబుతాను..''

ఒక విద్యార్థి: ''వద్దు మేడమ్... దానికంటే పాఠమే నయం...''

## పొడవెంత?

''రామూ! మౌంట్ ఎవరెస్ట్ పొడవెంతో చెప్పగలవా?'' అడిగింది టీచర్.

''ఐదు సెంటీమీటర్లు'' చెప్పాడు రాము.

''ఐదు సెంటీమీటర్లా...?''

''అవును మ్యాపులో కొలిచాను టీచర్...''

- స్వాతి


## ఇలా...

''నా గయ్యాళితనంవల్ల రెండు విధాలుగా లాభం చేకూరింది'' అమలతో చెప్పింది అనసూయ.

''అదెలా?'' అడిగింది అమల.

''ఒకటి- 'భర్తని నిత్యనూతనంగా సాధించడం ఎలా?' అనే పుస్తకం రాసి నేను పది వేలు సంపాదించాను. రెండు- 'సహనంతో జీవించడం ఎలా?' అనే పుస్తకం రాసి మావారు పాతికవేలు సంపాదించారు.''

- పరిమళాకిశోర్




## దొంగను దోచిన దొంగలు!

మహా బందిపోటు దొంగలు సహితం దోపిడీకి గురికావడం చిత్రంగా ఉంటుంది కదూ! చంబల్‌లోయలో అసంఖ్యాకమైన దోపిడీలు, హత్యలు చేసిన, చేయించిన ఫూలన్‌దేవిని ముగ్గురు యువకులు దోచుకొని 35 వేల రూపాయలు పట్టుకుపోయారు! ఫూలన్ టాటాసుమోలో వెళ్తూవుండగా ముగ్గురు యువకులు రివాల్వర్‌తో డ్రైవర్‌ను బెదిరించి ఫూలన్ హాండ్‌బ్యాగ్‌తో ఉడాయించారు! ఆ మహా దొంగలరాణే ఖంగుతిన్నది.

## పార్లమెంట్‌లో నిద్ర!

బీహార్‌కు చెందిన కాంగ్రెస్ యం.పి. ఆయన. నామధేయం రాజోసింగ్. ఈమధ్య అతను పార్లమెంట్‌లో సభ జరుగుతూ ఉండగా, ఏకంగా బెంచీ మీద తలవాల్చి హాయిగా నిద్రపోయాడు. సదరు రాజోగారికి ఈ నిద్ర కార్యక్రమం, గురకల ప్రోగ్రాం మామూలైపోయినందుకు సభ్యులంతా పడీ పడీ నవ్వుకున్నారు. అక్కడున్న వార్డ్‌స్టాప్ ఇది గమనించినా, దౌర్జన్యానికి మారు పేరయిన రాజోను నిద్రలేపడానికి సాహసించ లేకపోయారు. గ్యాలరీలో ఉన్న జనం, రాజో గురక శబ్దం వినిపిస్తుపోయారు. ''మేము ఎన్నుకున్నది బాగా తిని, పార్లమెంట్‌లో పడి నిద్రపోవడానికా?'' అని కోపం తెచ్చుకున్నారు. ఇదంతా పార్లమెంట్‌లో కొందరు చేస్తున్న ఘనకార్యం! మరికొందరైతే మేల్కొని ఉండీ, పొరపాటున కూడా నోరు విప్పరు! ప్రజావాణి వినిపించరు!

- కొడిమెల




అంటే మా వీధిలో వుండే అమ్మాయి చిన్నప్పటినుంచీ తెలుసు. పేరు నవజ. వాళ్ల కుటుంబంతో మాకు మంచి స్నేహం, రాకపోకలు వుండేవి'' అంటూ జరిగిందంత చెప్పాడు.

''అయితే నువ్వు ఆ అమ్మాయిని ప్రేమించావా?''

''మామయ్యా! నా పరిస్థితులు, ఆమె పరిస్థితులు అందుకు దారి తీసాయి. నిజానికి చదువుకుంటూ, ఉద్యోగం చేసుకుంటూ ఏ గొడవల్లోనూ ఇరుక్కోని ఆమెను వీధిలోకి లాగింది ముకుందం అన్నయ్య. ఆ అమ్మాయి చాలా మర్యాదగా వీడిని దూరంగా వుంచాలని చూసింది. దాంతో వీడు నవజను నానా అల్లరీ చేస్తున్నాడు.''

రఘుపతిగారు వింటున్నాడు.

''అంతటితో ఊరుకోకుండా ఆమె మీదా, నామీదా నాన్నకు లేనిపోనివి చెప్పాడు. ఎంత దారుణం అంటే అన్నయ్య తన స్నేహితుల్ని పురికొల్పి ఆమెను ఆఫీసు దగ్గరా, కాలనీలోనూ అల్లరి చేయిస్తున్నాడు. అటు నాన్న కూడా పరోక్షంగా ఆమెమీదకు తెలిసున్న వర్కర్స్‌ను, బజారు రౌడీలను డబ్బిచ్చి ప్రోత్సహించి అవమానాలపాలు చేస్తున్నాడు. ఇవన్నీ నవజ నాతో చెప్పి బాధపడింది. నా కళ్లతో నేను చూసాను. కొడుకుల మీద అనుమానంతో, తోడి ఉద్యోగస్తుడి మీద కోపంతో ఎవ్వరైనా ఇలా చేయవచ్చా? పెళ్లి కావాల్సిన అమ్మాయిని అల్లరిపాలు చేయడం ఎంతవరకూ న్యాయం అన్పించుకుంటుంది?''

''నిజమా?''

''అందుకనే నేను ఆ అమ్మాయికి అండగా నిలబడవల్సి వచ్చింది. ఓ పెద్దమనిషి, కొడుకులు తన చెయ్యి జారిపోతారని భయపడ్డంలో తప్పులేదు. కొడుకుల్ని అనుమానించడం, అదీ సహజమే కావచ్చు. కానీ ముక్కూ మొహం ఎరుగని ఓ అమ్మాయిని అందుకు బాధ్యురాలిని చేయడంలో ఏం న్యాయం వుంది? ఆడపిల్లల కన్న తల్లిదండ్రుల సమస్యలు నాన్నకి అర్థం కావు'' రాజీవ్ ఆగి అదోలా నవ్వి ''మా వీధిలో వున్న ఆడపిల్లలందరూ నన్నూ, అన్నయ్యనూ వల్లో వేసుకుందుకు పుట్టారని తెగ మదన పడతారు.''

'నువ్వు దేనికీ ఆవేశపడకు. ప్రశాంతంగా వుండు. నువ్వు చేపట్టిన కార్యం వెనుక నిజాయితీ వుంటే నీకు నీ లక్ష్యం ఎప్పుడూ దూరంగా పోదు. గుడ్ మేన్ బీయింగ్ సేవ్‌డ్ ఎట్ ది ఎలివెన్త్ అవర్ అని గోథే మహాశయుడు అంటాడు. ఆ మాట నిజం''.

• • •

''అవున్నాన్నా... నువ్వు నా పెళ్లి స్థిరపరిచావు. దాంతో రాజీవ్‌గాడికి అవకాశం దొరికింది. వాడూ, ఆ నవజా ఏది ఏమైనా పెళ్లి చేసుకుందామనే నిర్ణయానికి వచ్చారుట'' ముకుందం అన్నాడు.

''నీకెవరు చెప్పారురా...ఎలా తెలిసింది నీకీ విషయం?''

''కళ్యాణ్‌గాడు చెప్పాడు. ఇంకా చాలామంది చెప్పారు.''

వెంకట్రావుగారు ఆవేశపరుడయ్యాడు. ఆపైన ముక్కోపానికి లోనయ్యాడు. కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగాడు. వెంటనే వంటింట్లో వున్న జానకిని పిల్చి జరిగింది చెప్పి ఆమెమీద మండిపడ్డాడు.

''ఏమిట్రా నువ్వు చెప్తున్నది. ఆలోచించే మాట్లాడుతున్నావా?'' అంది కాస్తంత విసుగ్గా, కోపంతో జానకి.

''నీకు తెలియదమ్మా. వాళ్ల ప్రేమకథ ముదిరి పాకాన పడింది.''

జానకి ఓసారి ముకుందంవైపు చూసి తనని తను అదుపులో పెట్టుకుంటూ అంది ''నీకు నచ్చిన అమ్మాయిని నువ్వు పెళ్లి చేసుకుంటానంటే మేం ఈ మాట అన్నాం అనుకో. నువ్వేమనేవాడివి. నీకో న్యాయం, వాడికో న్యాయం వుంటుందేమిట్రా?''

''ఆ అమ్మాయి మంచిదికాదు.''

''ఓహో అలానా. నవజ మంచిదికాదు, రాజీవ్‌గాడు మంచివాడు కాదు. అసలు మంచివాళ్లెవ్వరా ఇక్కడ?'' అంది విసురుగా.

ముకుందం తల్లి హఠాత్తుగా అలా నిలదీసేటప్పటికి మ్రాన్పడిపోయాడు. వెంకట్రావుగారు కూడా నిప్పులు చెరుగుతున్న ఆమె కళ్లు చూసి ఆశ్చర్యపోయాడు.

''ఒకళ్ల మంచితనానికి కితాబులు ఇవ్వడానికి మనకున్న అర్హతలేమిటో ఆలోచించుకోవాలిరా? నవజ నీ ఒక్కడికే తెలుసున్న అమ్మాయి కాదు, నాకూ, నాన్నగారికీ కూడా తెలుసు. నువ్వు ఈమధ్యే ఈ కొత్త పాట పాడుతున్నావ్?'' ముకుందం తల దించుకున్నాడు.

''నేనూ మీ నాన్నగారూ మనందరం కూడా నవజ మంచి అమ్మాయి అని ఎన్నో కితాబులు ఇచ్చేవాళ్లం. నీకు ఒకప్పుడు నవజ అంటే ప్రాణం అనీ, మనసు పడుతున్నావనీ నేను గ్రహించలేదనుకోకు.''

''నువ్వింతకూ ఏమంటావమ్మా?''

''గతం గుర్తు చేస్తున్నానురా?''

''ఇప్పుడు అవన్నీ అనవసరం. ఏది ఏమైనా వాడు నవజను పెళ్లి చేసుకుని ఈ ఇంటి కోడలిగా తీసుకురావడానికి వీల్లేదు. ఒకవేళ...''

''కాదంటే వాడ్ని తవ్వి పాతేస్తారు. ఇంకా కోపం వస్తే నవజను ఏమైనా చేస్తామంటారు. కానివ్వండి. మీకు అడ్డేముంది.''

''అవును... వాళ్లిద్దరే కాదు, నువ్వూ నా మాటకు ఎదురు చెప్పడానికి వీల్లేదు.''

జానకి ఓసారి భర్త మొహంలోకి చూసింది. ఆ తరువాత ఓ నిశ్చయానికి వచ్చినదానిలా ''అయితే నా ఉద్దేశ్యం కూడా చెబుతున్నాను. రాజీవ్ ఆ అమ్మాయిని పెళ్లిచేసుకోవడం నాకిష్టమే. వాళ్లిద్దర్నీ నేను మనస్ఫూ

ర్తిగా ఆశీర్వదిస్తాను. ఎందుకంటారేమో కారణం కూడా చెబుతున్నాను వినండి. మీరూ, మీ పెద్దకొడుకూ కలసి ఆడుతున్న తెరవెనుక నాటకాలవల్ల ఆ నవజ ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొందో నాకు తెలుసు కాబట్టి.''

వెంకట్రావుగారు క్షణం తెల్లబోయారు. వెంటనే తేరుకున్నాడు. కళ్ళు ఎర్రజేసాడు.

''అసలు నీకేం తెలుసని? నీ వెర్రిమాటలు కట్టిపెట్టు. ఫలానా అమ్మాయి మాకు నచ్చలేదని అనడం వెనుక ఎన్నో చెప్పలేని కారణాలు వుంటాయి. మావల్ల ఆ పిల్ల ఇబ్బందుల పాలవడం ఏమిటి? నీకు మతిపోయింది.''

జానకి భర్త మొహంలోకి చూసి తన్నుకువస్తున్న కోపం ఆపుకుని తనని తను అదుపులో పెట్టుకుంటూ అంది ''మీకు తెలియదేమో! నవజకు నా దగ్గర చాలా చనువు వుంది. జరిగింది, జరుగుతున్నదీ ఆ అమ్మాయి ఎప్పటికప్పుడు నాకు చెప్తూనే వుంది. కట్నం ఇవ్వలేని విశ్వనాథంగారంటే మీకు అయిష్టం. కానీ నవజ నాకు బాగా కావాల్సిన కామాక్షిగారి కూతురు. ఆమె మీద ఈగ వాలినా నేను ఊరుకోలేను.''

''రాజీవ్‌గాడు నా మాట కాదన్నా, నువ్వు వాడికి సహాయపడ్డా నాకూ ఈ ఇంటికి రుణం తీరినట్టే. ఇది నా నిర్ణయం.''

ముకుందం అసహనంగా ''ఊరుకోండి నాన్నగారూ'' అని తల్లివైపు తిరిగి ''అమ్మా! నువ్వు నన్నూ, నాన్ననూ అకారణంగా నిందిస్తున్నావు. ఇంట్లో ఈ అశాంతికి కారణం రాజీవ్‌గాడే'' అన్నాడు.

జానకి దిటవుగానే అంది ''కాదురా అందుకు కారణం మీరిద్దరూ. ఈ ఇంట్లో అశాంతికి ముందు ఆజ్యం పోసింది మీ నాన్న. తరువాత నువ్వు. ముప్ఫై ఏళ్ళుగా ఈయనతో సంసారం చేస్తున్నాను. ఏ ఒక్క రోజూ మీ నాన్న నాతోగానీ, నా మాటతోగానీ ఏకీభవించలేదు. నేను మీకు ఏ ఒక్క చిన్నమాట చెప్పినా, దగ్గరకు తీసుకున్నా ఆయన సహించేవారుకాదు. నా కాలేజీ చదువుకూ, నా తెలివితేటల్ని ఎప్పుడూ అపహాస్యం చేస్తూనే వచ్చారు. మీరు తల్లిని ప్రేమించడం, తల్లి మాటను గౌరవించడం ఆయనకు ఏనాడూ ఇష్టం లేదు. నిన్ను నూతిలో కప్పలా పెంచారు. అలాగే పెరిగావు.''

''ఆ మాటలు ఏమిటమ్మా అన్యాయంగా అంటున్నావు.''

జానకికి కన్నీళ్ళు ఆగాయికాదు, మనిషి కాసేపు నిస్సత్తువతో ఊగిపోయింది.

''ఇది బాధరా, దీన్ని బాధ అంటారురా. మనిషయిన తర్వాత బాధ అనే మాటకు అర్థం తెలియాలిరా. ఆయన మాట వదిలేయ్. ఈ తరంవాడివి. నీకు బాధకు అర్థం తెలిస్తే నిన్ను కాదని తిరస్కరించిన అమ్మాయిని ఇబ్బందుల పాలు చెయ్యవు. ఆఖరి మాట చెప్తున్నాను. దయ వుంచి రాజీవ్‌గాడ్నీ, నవజనూ వాళ్ళ బ్రతుకులు వాళ్ళను బ్రతకనివ్వు.''

''నీకేమన్నా మతిపోయిందా జానకీ?''

''డబ్బుమీద మమకారంతో, పిల్లలమీద వెర్రి ప్రేమతో మతి చెడింది మీకు. అందుకే మీకు మీరు ఎన్నుకున్న దారి ఎంత హీనమయిందో అర్థం కావడం లేదు. పాతికేళ్ళులేని పసిమొగ్గను నలిపి పారేయడం మీకేకాదు, ఎవరికయినా తేలికయిన పనే.''

''జానకీ! నువ్వు హద్దులు మీరి మాట్లాడుతున్నావు. నేను ఏం చేస్తానో చెప్పానుకదా. నువ్వేం చేయగలవో అది చెయ్యి. నీ ధైర్యం ఏమిటో నేనూ చూస్తాను.''

జానకి నవ్వేసింది.

''మా అన్నయ్య మీతో వియ్యం అందడంకోసం తాంబూలాలు తీసుకున్నాడు. కానీ ఇంకా పిల్లనిచ్చి కన్యాదానం చేయలేదు. ఆయనకు మీ సంగతీ, వీడి సంగతీ కూడా తెలుసు. అయినా తన కూతుర్ని ఈ ఇంటనివ్వడానికి ఒప్పుకున్నాడంటే అందుకు కారణం నామీద వున్న ఆపేక్షా, నమ్మకమే. బహుశా వయసు మీద పడుతున్న మీరు కూడా ఏనాటికైనా ఆత్మ విమర్శ చేసుకుంటారని ఆశానూ. నేను ఈరోజే అన్నయ్యకు జరిగిందంతా వ్రాస్తాను. ఏ పరిస్థితుల్లోనూ రాధ ఈ నరకానికి వారసురాలు కాకూడదు. సరేనా?''

వెంకట్రావుగారు నిశ్చేష్టుడయి కోపంతో ఒళ్ళు తెలియక ఊగిపోయాడు. గట్టిగా ''అంటే నీ కొడుక్కి నువ్వే అపకారం చేస్తావన్నమాట.


అయితే అప్పుడు నువ్వు తల్లి అవవు. రాక్షసివి'' అంటూ జానకి మీదకు వెళ్ళబోయాడు. పక్కనే నుంచుని తల్లిదండ్రుల్ని చూస్తున్న ముకుందం మాటలుడిగి ఆపైన తల వంచుకుని బయటకు అడుగులు వేసాడు. జానకి తనమీదకొస్తున్న భర్తను చూసి నెమ్మదిగా అంది.

''మీరు మాట్లాడేదేదో దూరంగా నుంచునే చెప్పండి. అది మనిద్దరికీ మంచిది. నేను తల్లినో, రాక్షసినో నా పిల్లలు ఈవేళ కాకపోతే రేపైనా తెలుసుకుంటారు. కానీ మీరెవరో వాళ్లకు ఈపాటికి బాగా తెలిసే వుంటుంది. ఇంకా తెలుస్తుంది. కానీ మీలో వున్న బ్రూటస్ మనస్తత్వం వల్ల వాళ్ళు మరింత నష్టపోకుండా చూడమనే నేను ఆ దేవుడ్ని ప్రార్థిస్తాను'' ఆపైన ఆమె అక్కడనుంచి నెమ్మదిగా బయటకు వెళ్ళిపోయింది.

వెంకట్రావుగారు భార్య నోటి నుంచి వచ్చిన ఆ మాటలకు నిశ్చేష్టుడయ్యాడు. ఆ తరువాత సిగ్గుతో తన తల నేలను తాకడానికి క్రిందకు దిగజారుతూ వుంటే నిలువెల్లా కుంచించుకుపోయాడు.

★

## యంగ్ డిజైర్



వ్యక్తుల్లో ముసలితనం వచ్చేస్తే మాత్రం ఏంటి? మనసు మాత్రం ఎప్పుడూ యంగే! అలాగే మన అమితాబ్ గార్కి ఈమధ్య మనసులో ఓ కోరిక దొలిచేస్తోందిట. అదేంటంటే...ఐశ్వర్యారాయ్, టాబూలతో కలసి రొమాన్స్ సీన్స్‌లో నటించాలనట. అదేంటో! ఈ వయసులో ఈయనగారికి ఈ కోరిక!



## బెస్ట్ ఆఫ్ లక్

తెలుగులో హిట్ అయిన 'తొలిప్రేమ' రీమేక్ 'ముజే కుచ్ కెహనా హై'. దీంట్లో జితేంద్ర కొడుకు తుషార్ నటించాడు. మిచ్‌గాన్ యూనివర్సిటీలో చదివి వచ్చిన తుషార్‌కి సినిమాల్లో నటించాలని ఇంట్రస్ట్. ఇతని అభిమాన హీరో అమితాబ్ అట. అంత పేరు తెచ్చుకోవాలని ఆశిద్దాం మరి!

## హేపీగా వుంది

'కుక్కు కావాలి' అంటూ 'చిత్రం' సినిమాలో నా కూతురు హీరోకి తమ్ముడిగా నటించింది. నాతో ఓ సాంగ్ కూడా ఉంది. నాకెంతో హేపీగా వుందని చెప్పాడు ఉత్తేజ్. కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అనేక సినిమాల్లో నటిస్తున్న ఉత్తేజ్ అయితే ఇక తన పిల్లల్ని కూడా సినిమాల్లోకి లాగినట్టేగా! ఓకే ఉత్తేజ్! ఆల్ ది బెస్ట్.

-విరాజి

